బీసీలకు ఇచ్చిన మాట తప్పిన కాంగ్రెస్

గజ్వేల్లో విలేకరులతో మాట్లాడుతున్న కళ్యాణ్‌కర్ నర్సింగరావు

గజ్వేల్, నవంబర్ 9: అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ బీసీలకు ఇచ్చిన మాటను అధికారంలోకి రాగానే తప్పిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కళ్యాణ్‌కర్ నర్సింగరావు అన్నారు. శనివారం గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కామారెడ్డి సభలో బీసీ డిక్లరేషన్ పేరుతో 42శాతం రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పి ఈ రోజు కులగణన పేరుతో కాలయాపన చేయాలని చూస్తున్నదన్నారు. రిజర్వేషన్ విధానం నిజానికి రాజ్యాంగ రచనలోనే బీసీలకు అన్యాయం జరిగిందన్నారు. ఆనాడే అంబేద్కర్ భవిష్యత్ ప్రభుత్వాలు వెనుకబడిన తరగతులకు తగు అభివృద్ధి చర్యలు తీసుకోవాలని సూచించారన్నారు. ఆనాడే బీసీలకు ఉద్యోగాల్లో 70శాతం రిజర్వేషన్ కల్పించాలని తెలిపినప్పటికీ దానిని కోల్డ్‌స్టోరేజీలో ప్రభుత్వాలు వేశాయన్నారు. ప్రధాని మోదీ ఏకపక్షంగా రాజ్యాంగాన్ని సవరించి ఈడబ్ల్యూఎస్ పేరుతో ఓసీలకు రిజర్వేషన్లు తీసుకొచ్చి బీసీల నోట్లో మట్టి కొట్టారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు న్యాయం చేసే దిశగా చూడాలన్నారు. మాజీ కౌన్సిలర్‌శ్రీనివాస్, బీసీ సెల్ బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మల్లేశం, నాయకులు కళ్యాణ్‌కర్ శ్రీనివాస్, కరీం, శంకర్, షరీఫ్, రాము లు, ప్రవీణ్, కరుణాకర్, కృష్ణ పాల్గొన్నారు.

కార్తికశోభితం

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు జరిపిస్తున్న భక్తులు

వర్గల్,నవంబర్ 9: వర్గల్ మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నాచగిరి లక్ష్మీనృసింహస్వామి దివ్యక్షేత్రం కార్తికమాసం నిత్య పూజలతో శోభితమైంది. ఉపవాసదీక్షలు, నిత్యసందర్శకుల తాకిడితో శ్రీవైష్ణవక్షేత్రం అలరారుతున్నది. రాష్ట్రంలోని ఆయా ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పెద్ద ఎత్తున స్వామివారి సన్నిధిలో పూజలు నిర్వహించారు. ఉదయం వేకువ జాము నుంచే భక్తులు దేవతామూర్తుల దర్శనంకోసం క్యూలో బారులు తీరారు. ఈ సందర్భంగా సాయంత్రం వరకు 95 మంది జంటలు సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఆచరించగా, తొమ్మిది జంటలు స్వామివారి పేరిట కల్యాణాలు జరిపించి మొక్కులు చెల్లించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో అన్నపూర్ణ, సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.

చెలిమి ఫౌండేషన్ చేయూత

ఆర్థికసాయం అందజేస్తున్న చెలిమి ఫౌండేషన్ సభ్యులు

గజ్వేల్, నవంబర్ 9: మున్సిపల్ పరిధిలోని పదో వార్డుకు చెందిన చిక్కుడు కిరణ్ ఆగస్టులో రాజీవ్ రహదారి గౌరారం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడికి భార్య పావని, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. విషయం తెలుసుకున్న గజ్వేల్‌కు చెందిన చెలిమి ఫౌండేషన్ సభ్యులు నిరుపేద కుటుంబానికి ఆర్థికసాయం అందించి అండగా నిలిచారు. కుటుంబ సభ్యులకు నిత్యావసర సరుకులు, నగదు రూ.11,500 అందజేశారు.కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు మంగలిపల్లి కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు యాదగిరి, సభ్యులు తులసిదాస్, శ్రీనివాస్, ఆంజనేయులు, యాట ఆంజనేయులు, రమేశ్, నర్సింహులు పాల్గొన్నారు.

రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంగెస్

మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నూనె కుమార్‌యాదవ్

కొండపాక(కుకునూరుపల్లి), నవంబర్ 9 : రైతుల పట్ల కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నూనె కుమార్‌యాదవ్ ఆరోపించారు. శనివారం కొండపాక మండలంలోని దుద్దెడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి కొండపాక మండల వ్యాప్తంగా రైతులు తమ ధాన్యాన్ని కల్లాల్లో పోసి నెల రోజులు దాటినా ఇంతవరకు కొనుగోలు ప్రారంభించలేదన్నారు. నెల రోజుల నుంచి రైతులు కల్లాల చుట్టే తిరుగుతున్నారన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి ఈ రోజు వరకు ఇవ్వలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చేసే వికృత చేష్టలను ప్రజలు గమనిస్తున్నారని కాంగ్రెస్‌ను గద్దె దించే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. వెంటనే ధాన్యం కొనుగోలు చేసి రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమచేయాలని, లేని పక్షంలో రైతులకు మద్దతుగా పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. నాయకులు చిక్కుడు భాను, పల్లె బాబు, ఎండీ.ముగ్దుమ్, నేతి గణేశ్, రాకేశ్, శ్యామ్ పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

మాట్లాడుతున్న బండకింది అరుణ్‌కుమార్

చేర్యాల, నవంబర్9: అసెంబ్లీ ఎన్నికలకు ముందు కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని కల్లుగీతకార్మిక సంఘం(కేజీకేఎస్)జిల్లా కార్యదర్శి బండకింది అరుణ్‌కుమార్ విమర్శించారు. శనివారం చేర్యాల మండలంలోని పెద్దరాజుపేటలో సొసైటీ అధ్యక్షుడు కొయ్యడ బాలయ్యగౌడ్ కేజీకేఎస్ గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్లుగీత కార్మికులు ప్రమాదాలబారిన పడకుండా సేఫ్టీ కిట్లు అందజేయాలన్నారు. 50ఏండ్లు నిండిన గీతకార్మికులకు పింఛన్ సౌకర్యం కల్పించాలన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో గీతకార్మికుల సంక్షేమానికి రూ.5వేల కోట్లు కేటాయించి, కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో చెప్యాల వెంకటేశ్, నగేశ్, సంతోష్, రమేశ్, నర్సింహులు, నరహరి పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

ఉద్యమకారులను సన్మానిస్తున్న మల్లేశ్

హుస్నాబాద్, నవంబర్ 9: తెలంగాణ ఉద్యమకారులకు అసెంబ్లీ ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్ డిమాండ్ చేశారు. శనివారం హుస్నాబాద్‌లోని అనభేరి సింగిరెడ్డి స్మారక భవనంలో జరిగిన తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యమకారులందరికీ 250 గజాల ఇంటి స్థలం, జిల్లా కేంద్రంలోని వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, మూడు ఎకరాల వ్యవసాయ భూమి, నెలకు రూ.25వేల పింఛన్ ఇచ్చి ఆదుకోవాలన్నారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27వ తేదీన కరీంనగర్‌లోని అమరవీరుల స్తూపం నుంచి వేములవాడలోని మహదేవుని ఆలయం వరకు విజయసంకల్ప మహాపాద్రయాత్ర చేపట్టామన్నారు. అనంతరం తెలంగాణ ఉద్యమకారులను సీపీఐ ఆధ్వర్యంలో సన్మానించారు.కార్యక్రమంలో ఫోరం నియోజకవర్గ ఇన్‌చార్జి మదాసు శ్రీనివాస్, కరీంనగర్ జిల్లా చైర్మన్ కుమారస్వామి, నాయకులు సదానందం, సంజీవరెడ్డి, శ్రావణ్‌రెడ్డి, మనోహర్, అంకుశావలి, స్వాతి, లక్ష్మి, ఎల్లవ్వ, భాగ్యలక్ష్మి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

మిరుదొడ్డి: భూంపల్లి పీఎస్‌లో రికార్డులను పరిశీలిస్తున్న సిద్దిపేట ఏసీపీ మధు

వర్గల్, నవంబర్ 9: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలని గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి అన్నారు. శనివారం బేగంపేట పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు.ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను పరిశీలించి అనంతరం మొక్కలు నాటారు. అనంతరం సిబ్బంది యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీఐ లతీఫ్, స్టేషన్ ఎస్‌హెచ్‌వో, ఇన్‌చార్జి ఎస్సై అమృత్, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితుల పట్ల మర్యాదగా ఉండాలి

మిరుదొడ్డి, (అక్బర్‌పేట-భూంపల్లి), నవంబర్ 9 : పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో పోలీస్ సిబ్బంది మర్యాదగా ఉండాలని సిద్దిపేట ఏసీపీ మధు అన్నారు. శనివారం అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని భూంపల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించిన తర్వాత పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. విధుల పట్ల పోలీస్ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరి ంచారు. దుబ్బాక సీఐ శ్రీనివాస్, భూంపల్లి ఎస్సై వి.హరీశ్ పాల్గొన్నారు.

కులగణన సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

సిద్దిపేట కలెక్టరేట్: వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్,నవంబర్ 9: కులగణన సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఎన్యూమరేటర్లను ఆదేశించారు. సమగ్ర సర్వేపై శనివారం సీఎస్ శాంతికుమారి, ప్రధాన కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ ఎలాంటి సందేహాలు ఉన్నా ఎన్యూమరేటర్లు కలెక్టర్ల దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజలు ఎలాంటి అపోహలు పడకుండా ఎన్యూమరేటర్లకు సమాచారం ఇవ్వాలని, సర్వే ప్రక్రియలో ఎన్యూమరేటర్లు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ మనుచౌదరి మాట్లాడారు. జిల్లా అధికారులు, మండల ప్రత్యేకాధికారు లు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సర్వే పక్కా గా నిర్వహించాలని ఆదేశించారు. సర్వే గురించి ముందస్తుగా స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియజేయాలన్నారు. జిల్లా నోడల్ అధికారి, ఆర్డీవోలు, నియోజకవర్గ ప్రత్యేకాధికారులు, మండల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు సర్వేను పర్యవేక్షించాలన్నారు. సర్వేలో ఎలాంటి తప్పులకు తావులేకుండా సాఫీగా నిర్వహించేలా చూడాలన్నారు. సర్వే నిర్వహించిన ఫారాలను గ్రామీణ ప్రాంతాల్లో తహసీల్దార్, పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో స్టోర్ చేయాలన్నారు. సోమవారం నుంచి డాటా ఎంట్రీ చేసేందుకు ఆపరేటర్లు, కంప్యూటర్లను సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, సీపీవో దశరథ్, సిద్దిపేట , హుస్నాబాద్, గజ్వేల్ ఆర్డీవోలు సదానందం, రామ్మూర్తి, చంద్రకళ పాల్గొన్నారు.

కొమురవెల్లి: కిష్టంపేటలో సర్వేను పరిశీలిస్తున్న స్పెషల్ ఆఫీసర్ శ్రీరాంరెడ్డి

సర్వేను పరిశీలించిన స్పెషల్ ఆఫీసర్లు

కొమురవెల్లి, నవంబర్ 9 : మండల కేంద్రంతో పాటు ఐనాపూర్, గౌరాయపల్లి, కిష్టంపేట, మర్రిముచ్చాల, పోసాన్‌పల్లి, రాంసాగర్ గ్రామాల్లో కొనసాగుతున్న కులగణన సర్వేను నియోజవర్గ స్పెషల్ ఆఫీసర్ శ్రీరాంరెడ్డి, కొమురవెల్లి మండల స్పెషల్ ఆఫీసర్ ఎస్‌కే అహ్మద్ వేర్వురుగా పరిశీలించారు. ఈ సందర్భంగా పలు వివరాలను ఎన్యూమరేటర్లను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీవో కుమారస్వామి, డిప్యూటీ తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీవో శ్రీనివాసశర్మ, ఆర్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మద్దూరులో కులగణన సర్వేను ప్రారంభిస్తున్న జీవన్‌రెడ్డి

సర్వేకు సహకరించాలి

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్ 9: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి అన్నారు. మద్దూరు మండల కేంద్రంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఆయన ప్రారంభించారు. ఎంపీడవో రామ్మోహన్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ తాజ్‌మహ్మద్, సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

లెక్కలు తేల్చడానికే కుల గణన

మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్

సిద్దిపేట టౌన్,నవంబర్ 9 : దశాబ్దాలుగా చేసిన పోరాటాల ఫలితమే కుల గణన అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కులాల లెక్కలు తేల్చడానికే కుల గణన ప్రభుత్వం చేపడుతుందన్నారు.కులాల గణన బీసీల కోసమే జరుగుతుందన్న విషయం మరువద్దన్నారు.బీసీల ఐక్యతకు మహబూబ్‌నగర్ జిల్లా అలంపూర్ నుంచి ఆదిలాబాద్ వరకు కుల గణన చైతన్య సదస్సు యాత్ర చేస్తున్నామన్నారు. బీసీ నేతలు శ్రీనివాస్ విక్రం గౌడ్,నవీన్‌గౌడ్, సాయికిరణ్, ప్రభు,అరుణ్, మహేశ్,భార్గవ్,నరేందర్,కాంత్రి చంద్రబాబు,సంజు,రాజేశ్ పాల్గొన్నారు.

కోతకు గురైన రోడ్డు

కోతకు గురైన వల్లంపట్ల-ఉప్పరోనిగడ్డ గ్రామాల మధ్య బీటీ రోడ్డు

మద్దూరు(ధూళిమిట్ట), నవంబర్ 9: మద్దూరు మండలంలోని వల్లంపట్ల-ఉప్పరోనిగడ్డల మధ్యలోని బీటీ రోడ్డు వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు కోతకు గురైంది. కోతకు గురైన రోడ్డుకు మరమ్మతులు చేపట్టడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వల్లంపట్ల-ఉప్పరోనిగడ్డల మధ్య భారీ వాహనాల రాకపోకలు పూర్తిస్థాయిలో నిలిచిపోయాయి. రాత్రి ఈ రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. సంబంధితశాఖ అధికారులు తక్షణమే స్పందించి కోతకు గురైన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వల్లంపట్ల, ఉప్పరోనిగడ్డ ప్రజలు డిమా ండ్ చేస్తున్నారు.

మలేషియాలో డప్పు కళా ప్రదర్శన

మలేషియాలో డప్పు కళా ప్రదర్శన నిర్వహిస్తున్న అందె భాస్కర్

మిరుదొడ్డి, నవంబర్ 9 : మైట మలేషియా తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం తెలంగాణ 10 ఏండ్ల పండుగను వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా మిరుదొడ్డి మండలంలోని అందె గ్రామానికి చెందిన అందె భాస్కర్ బృందం డప్పు కళా ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో డప్పుల కళాకారులు పాల్గొన్నారు.

చేర్యాల రెవెన్యూ డివిజన్ జేఏసీ మండల కమిటీల ఏర్పాటు

కమిటీలను ప్రకటిస్తున్న జేఏసీ చైర్మన్ రామగళ్ల పరమేశ్వర్

చేర్యాల, నవంబర్ 9: చేర్యాల రెవెన్యూ డివిజన్ జేఏసీ నాలుగు మండలాల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జేఏసీ చైర్మన్ డాక్టర్ రామగళ్ల పరమేశ్వర్ అన్నారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిటీలను ప్రకటించారు. చేర్యాల టౌన్ కన్వీనర్‌గా ఆడెపు నరేందర్, కో-కన్వీనర్లుగా కాటం సురేందర్, చెవిటి లింగం, పోలోజు కుమారస్వామి, చేర్యాల రూరల్ కమిటీ కన్వీనర్‌గా నర్ర మహేందర్‌రెడ్డి, కో-కన్వీనర్‌గా మంజ మల్లేశం, కొమురవెల్లి మండల కన్వీనర్‌గా చెరుకు రమణారెడ్డి, కో-కన్వీనర్లుగా దండ్యాల లక్ష్మారెడ్డి, కుడిక్యాల బాల్‌మోహన్, మద్దూరు మండల కన్వీనర్‌గా రామడుగు బాలరాజు, కో-కన్వీనర్లుగా మోకు ఉదయ్‌రెడ్డి, జంగిలి యాదగిరి, ధూళిమిట్ట మండల కన్వీనర్‌గా సుందరగిరి భాస్కర్, కో-కన్వీనర్లుగా కోడెం యాదగిరి, వలబోజు నర్సింహచారి, మహిళా జేఏసీ కన్వీనర్‌గా ఇర్రి ఉమాసురేశ్‌రెడ్డి, అసంఘటిత కార్మికుల జేఏసీ కన్వీనర్‌గా ఒగ్గు తిరుపతి, కార్యాలయ కార్యదర్శిగా బండి శ్రీనివాస్‌గౌడ్‌ను నియమించారు. సమావేశంలో డివిజన్ కో-కన్వీనర్ తోకల ఉమారాణి, రాజకీయ పార్టీల సంప్రదింపుల కమిటీ సమన్వయకర్తలు పుర్మ ఆగంరెడ్డి, అందె బీరయ్య, జేఏసీ అధికార ప్రతినిధి అందె అశోక్, కార్యక్రమాల అమలు కమిటీ సమన్వయకర్త ఆది శ్రీనివాస్, పుర్మ సంజీవరెడ్డి, కార్యాలయ కార్యదర్శి బండి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ఉద్యమాన్ని నీరుగార్చేందుకు ప్రయత్నిస్తే సహించం

సమావేశంలో మాట్లాడుతున్న మోకు కనకారెడ్డి

చేర్యాల, నవంబర్ 9: చేర్యాల రెవెన్యూ డివిజన్‌తో పాటు చేర్యాల నియోజకవర్గ కేంద్రం ఏర్పాటు కోసం సీపీఎం ఆధ్వర్యంలో బలమైన పోరాటం చేస్తామని ఆపార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు మోకు కనకారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని వాసవి గార్డెన్‌లో సీపీఎం 20వ మహాసభలు పోలోజు శ్రీహరి, ఇప్పకాయల శోభ, ముస్త్యాల ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయ మాట్లాడుతూ చేర్యాల రెవెన్యూ డివిజన్ కోసం గత ఎనిమిదేండ్లుగా సీపీఎం వివిధ రూపాల్లో ఉద్యమిస్తుందన్నారు. కాంగ్రెస్ చేర్యాల రెవెన్యూ డివిజన్ అంశాన్ని నీరుగార్చే ప్రయత్నాలు చేస్తుందని, అందులో భాగంగానే అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తిని జేఏసీ చైర్మన్‌గా ప్రకటించినట్లు విమర్శించారు. ఉద్యమాన్ని నీరుగార్చేవిధంగా ప్రయత్నిస్తే సహించేదిలేదన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కామునె గోపాలస్వామి, కొంగర వెంకట్‌మావో, చొప్పరి రవికుమార్, బండకింది అరుణ్‌కుమార్, దాసరి ప్రశాంత్ రాళ్లబండి నాగరాజు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు

హ్యాండ్ బాల్ పోటీలో తలపడుతున్న రంగారెడ్డి, హైదరాబాద్ బాలికల జట్లు

హుస్నాబాద్, నవంబర్ 9: హుస్నాబాద్ పట్టణంలోని మినీ స్టేడియంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. శనివారం రెండో రోజు పది ఉమ్మడి జిల్లాల జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఉదయం ఎనిమిది గంటల నుంచే మ్యాచ్‌లు ప్రారంభమయ్యాయి. మ్యాచ్‌లను తిలకించేందుకు స్థానిక క్రీడాకారులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆదివారం సాయంత్రం పోటీలు ముగియనున్నాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీల్లో ప్రతిభ కనబచ్చిన క్రీడాకారులు నేషనల్‌కు ఎంపికవుతారు. ఈ పోటీల్లో మొత్తం 320మంది బాలబాలికలు పాల్గొంటున్నారు. రెండో రోజు క్రీడా పోటీలను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, మండల విద్యాధికారి బండారి మనీల పర్యవేక్షించారు. పీడీలు, పీఈటీలు రావుల శ్రీనివాస్, జంగపల్లి వెంకటనర్సయ్య, బూట్ల శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, కోచ్‌లు, రెఫరీలు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా పోలీస్ సైరన్ బిగించొద్దు

పోలీస్ సైరన్ ఏర్పాటు చేసుకున్న వాహనాన్ని పట్టుకున్న పోలీసులు

సిద్దిపేట టౌన్,నవంబర్ 9 : అనుమతి లేకుండా సొంత వాహనాలకు పోలీస్ సైరన్ బిగించుకోవద్దని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. సిద్దిపేట ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ సర్కిల్ పరిధిలో శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 6 వాహనాల సైరన్లను తొలిగించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై గోపాల్‌రెడ్డి,ఏఎస్సై జగదీశ్వర్,పోలీసులు రఘు,కుమార్ పాల్గొన్నారు.

శాసన మండలిలో గొంతు వినిపిస్తా

మాట్లాడుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి పోకల నాగయ్య

సిద్దిపేట టౌన్,నవంబర్ 9 : పట్టభద్రుల సమస్యల పరిష్కార సాధనకు శాసన మండలిలో గొంతు వినిపిస్తానని తెలంగాణ లెక్చరర్స్ ఫోరం రాష్ట్ర కన్వీనర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి పోకల నాగయ్య అన్నారు.సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కరోనా సమయంలో సైతం లెక్చరర్స్ ఫోరం నిరుద్యోగ ప్రైవేట్ ఉద్యోగులకు అండగా నిలిచి సేవ చేసిందన్నారు. ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యలపై 18 ఏండ్లుగా కృషి చేస్తున్నామన్నారు. టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజేశ్‌యాదవ్, టీఎల్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కైలాశ్, నేతలు నర్సింహులు ,మహేశ్, వెంకటేశ్వర్లు,రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కొండపాక(కుకునూరుపల్లి), నవంబర్ 9 : కొండపాక మండల కేంద్రంలో అస్టియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ యూరాలజీ హైదరాబాద్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సుమారు 200 మందికి పైగా ఉచితంగా వైద్య పరీక్షలు చేయడంతో పాటు మందులు అందజేశారు. డాక్టర్లు గౌతం, జార్జి మూలార్, సందీప్‌కుమార్, గౌతంకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

శబరిమల యాత్రకు ఆర్టీసీ బస్సులు

హుస్నాబాద్, నవంబర్ 9: అయ్యప్ప స్వాముల కోసం శబరిమల యాత్రకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు హుస్నాబాద్ డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు తెలిపారు. గతంలో శబరిమల యా త్రకు వెళ్లిన బస్సులకు కిలోమీటరుకు రూ. 65 ఉండేదని, ప్రస్తుతం ఈ ధరను రూ.59కి తగ్గించడం జరిగిందన్నారు. బస్సు బుక్ చేసి న గురుస్వామికి ఉచిత ప్రయాణం ఉంటుందని తెలిపారు. సూపర్‌లగ్జరీ బస్సుకు కిలోమీటర్‌కు రూ.59, రాజధాని ఎక్స్‌ప్రెస్‌కు రూ.7 7, డిలక్స్ బస్సుకు రూ.57 ఉంటుందన్నా రు. మొదటి రెండు బస్సుల్లో 36 సీటింగ్ కెపాసిటీ, డీలక్స్‌లో మాత్ర 41సీట్లు ఉంటాయన్నారు. వంట మనిషి, ఇద్దరు మణికంఠ స్వాములు, అటెండర్‌కు ఉచితంగా అనుమతి ఇస్తున్నామని, హుస్నాబాద్ డిపో పరిధిలోని అయ్యప్పస్వాములు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు డిపోలో సంప్రదించాలన్నారు.

యువకుడి వేధింపులతో వివాహిత ఆత్మహత్య

మర్కూక్, నవంబర్9: యువకుడి వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మర్కూక్ మండలం ఎర్రవల్లిలో చోటు చేసుకుంది. మర్కూక్ ఎస్సై దామోదర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం కళ్యాణి గ్రామానికి చెందిన ప్రియాంక (25) ను మర్కూక్ మండలం ఎర్రవల్లికి చెందిన ఇస్తారి రమేశ్‌కి ఇచ్చి మూడేండ్ల క్రితం వివాహం జరిపించారు. ఆమెకు ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కొన్ని నెలల క్రితం ఆమెకు పరిచయమైన ఎర్రవల్లికి చెందిన కుంట భాస్కర్ వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకున్నది. తమ కూతురు ఇంట్లో ఉరివేసుకొని మృతి చెందిందని ప్రియాంక తల్లిదండ్రులు కిష్టవ్వ కాశీరామ్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై తెలిపారు.

పార్టీలు మారే వారికి మాట్ల